సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం। 19। సెప్టెంబర్। 2025


ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు 8లో


అమెరికా బిల్లు.. ఐటీ కంపెనీలకు చిల్లు 8లో



పేదలకు లేటెస్ట్ కాస్మోటాలజీ సేవలు 8లో


గురుద్వారా కూడలి సమీపంలో తరలిస్తున్న టిఫిన్ బడ్డీ

చిరు వ్యాపారులపై ముప్పేట దాడి


గ్రీన్‌పార్క్ రోడ్డులో బడ్డీని తొలగిస్తూ..

రెక్కాడితే కాని డొక్కాడని చిరు వ్యాపారులపై ఉక్కుపాదం మోపారు. ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకొని పొట్టపోసుకుంటున్న వారిపై జులుం ప్రదర్శించారు. ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా టీ స్టాళ్లు, టిఫిన్‌బళ్లు, బడ్డీలను జేసీబీలతో తొలగించారు. బడ్డీల్లో సరుకులు, డబ్బులు సైతం తీసుకునే సమయం ఇవ్వకుండా తరలించడంతో పేదలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఏళ్లగా రోడ్డు పక్కన చిరు వ్యాపారాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తమను రోడ్డున పడేశారని, ఎలా బతికేది, ఎక్కడ బతికేదంటూ వ్యాపారులు బతిమలాడినా అధికారులు కనికరించలేదు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో సీతంపేట మెయిన్‌రోడ్, శంకరమఠం రోడ్, నరసింహనగర్ రైతుబజార్, గ్రీన్‌పార్క్ రోడ్డు, ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం బంక్ వరకు, మధురవాడ, తగరపువలస, ఎండాడ, గాజువాక ప్రాంతాల్లో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, పోలీస్ విభాగం సంయుక్తంగా గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి.


సీతంపేట మెయిన్‌రోడ్‌లో తొలగించిన బడ్డీలను లారీలో తరలిస్తున్న సిబ్బంది

- చిరువ్యాపారుల రెక్కలు విరిచిన కూటమి సర్కార్
- ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డుపాల్జేశారు
- టీ స్టాళ్లు, టిఫిన్ బళ్లు, బడ్డీల తొలగింపు

ఉదయం 7 గంటల నుంచే..

సీతంపేట : జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, పోలీసులు, సచివాలయ కార్యదర్శులు గురువారం ఉదయం 7 గంటలకే జేసీబీలు, లారీలతో ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి చందు స్వీట్స్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి హైవే వరకు ద్వారకానగర్, సీతంపేట మెయిన్‌రోడ్‌లో రహదారికి ఇరువైపులా రోడ్డుపై, ఫుట్‌పాత్‌పై ఉన్న బడ్డీలు, టిఫిన్ బళ్లు, టీ స్టాళ్లు, ఫ్రూట్‌స్టాళ్లు, పకోడీ బళ్లు, బిర్యానీ, కర్రీపాయింట్లను జేసీబీలతో తొలగించి లారీల్లో తరలించారు. బీవీకే కళాశాల ఎదురుగా ఉన్న బడ్డీలను జేసీబీతో ధ్వంసం చేయడంతో వ్యాపారులు గగ్గోలుపెట్టారు. బడ్డీల్లోని సరుకులు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సీతంపేట కూడలిలో దుర్గాగణపతి ఆలయం పరిసరాల్లో ఉన్న వ్యాపారాలను తొలగించారు. అక్కడ నుంచి గురుద్వారా కూడలి సమీపంలో వైన్‌షాపు ముందున్న బోర్డును తీసేశారు. అక్కడే ఉన్న టీ స్టాల్, టిఫిన్ స్టాళ్లలోని స్టీల్ కౌంటర్లు తరలించడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం హైవే నుంచి డైమండ్ పార్కు వరకు ఉన్న శంకరమఠం రోడ్‌లో బడ్డీలు, తోపుడు బళ్లు తొలగించారు. ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే రోడ్డుపాలు చేశారని చిరువ్యాపారులు మండిపడ్డారు.


గురుద్వారా కూడలి సమీపంలో తరలిస్తున్న టిఫిన్ బళ్లు

ప్రజాప్రతినిధులు లేని సమయంలో..

ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు లేని సమయం చూసి ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపులు చేపట్టారు. కార్పొరేటర్లు వారం రోజుల పాటు స్టడీటూర్‌కు రాజస్థాన్ వెళ్లారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు, ఎంపీ పార్లమెంట్ సమావేశాలకు వెళ్లారు. చిరు వ్యాపారులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఒక్క ప్రజాప్రతినిధి అందుబాటులో లేని సమయంలో డ్రైవ్ చేపట్టారు. దీంతో ఏమి చేయాలో తెలియక వ్యాపారులు ఆవేదనకు గురయ్యారు.

దివ్యాంగుడిని ఎలా బతకాలి



గత 19 ఏళ్లుగా సీతంపేట జంక్షన్‌లో పకోడి బండి వేస్తున్నాను. నేను దివ్యాంగుడిని, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పకోడి బండిపై వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ముందస్తు నోటీసు, సమాచార ఇవ్వకుండా ఉన్నపళంగా లారీలో బండిని పట్టుకుపోయారు. నా కుటుంబాన్ని రోడ్డున పడేశారు. ఎలా బతకాలి.

– **పతివాడ శ్రీరాములు**, పకోడి బండి, సీతంపేట

రోడ్డున పడేశారు



సీతంపేట మెయిన్‌రోడ్‌లో మార్గదర్శి బిల్డింగ్ పక్క రోడ్‌లో టీ కొట్టు నడుపుతున్నాను. సుమారు 15 సంవత్సరాలుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నాను. మెయిన్‌రోడ్‌పై లేకపోయినా నా బండి తొలగించారు. ఉన్నపళంగా తొలగిస్తే మాలాంటి వాళ్లు ఎలా బతకాలి. మా కుటుంబాన్ని రోడ్డునపడేశారు.

– **ఎల్.మహేష్**, టీ కొట్టు, సీతంపేట

కౌంటర్‌లో డబ్బులు తీసుకోనీయలేదు



గత 28 ఏళ్లుగా సీతంపేట దుర్గాగణపతి ఆలయం పక్కన టీ, టిఫిన్ షాపు నిర్వహిస్తున్నాను. రోడ్డుకు అడ్డుగా లేకపోయినా, షాపు ముందున్న రెండు స్టీల్ కౌంటర్లు జేసీబీతో పట్టుకెళ్లిపోయారు. కనీసం కౌంటర్‌లో ఉన్న డబ్బులు కూడా తీసుకునే సమయం ఇవ్వలేదు. పెద్దోళ్లని వదిలి చిరువ్యాపారులపై ప్రతాపం చూపడం దారుణం.

– **పిన్నింటి అప్పలనాయుడు**, టిఫిన్ షాప్, సీతంపేట

రోడ్డున పడిన 50 కుటుంబాలు


న్యాయం చేయాలని నరసింహనగర్ రోడ్డుపై బైఠాయించిన వ్యాపారులు

తాటిచెట్లపాలెం: నరసింహనగర్ రైతుబజార్ వద్ద 30 ఏళ్లుగా చిరు వ్యాపారాలు సాగిస్తున్న 50 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గురువారం ఉదయం జీవీఎంసీ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తొలగించి జీవనోపాధిని దెబ్బతీశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల సిబ్బంది ఉదయాన్నే ఇక్కడకు చేరుకొని పొక్లెయినర్లతో బడ్డీలను, వస్తువులను విరగ్గొట్టి మరీ లారీల్లోకి ఎక్కించారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో చిరు వ్యాపారులు రోడ్డెక్కి ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లేసి గెలిపించినందుకు కూటమి ప్రభుత్వం తమకు మంచి శాస్తి చేసిందని చిరు వ్యాపారులంతా వాపోతున్నారు. తమకు ప్రత్యామ్నాయం చూపకుండా.. బడ్డీలను తొలగించడంతో జీవనోపాధి కోల్పోయామని, ఎలా బతకాలని విలపించారు.

జీవనాధారాన్ని తొలగించారు



ఉదయం నుంచి మామీద ముప్పేట దాడి చేసి జీవనాధారాన్ని తొలగించారు. సుమారు 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో వ్యాపారం చేసుకున్న వారిని రోడ్డున పడేశారు. కనీసం సమయం కూడా ఇవ్వలేదు. ప్రత్యామ్నాయం చూపాలి కదా. ఇప్పుడు ఎలా బతకాలి.

– **ప్రకాష్**, చిరు వ్యాపారుల ప్రతినిధి, నరసింహనగర్ రైతుబజార్

ఇది పేదలను వేధించే ప్రభుత్వం



గత 20 ఏళ్లుగా ఇక్కడే పండ్ల వ్యాపారం చేసుకుంటున్నాం. ఇప్పటికిప్పుడు ఇలా తీసేస్తే ఎలా? కనీసం సమయం ఇవ్వాలి కదా? ఇప్పుడు వ్యాపారం కోసం చేసిన ఫైనాన్స్‌లు కట్టుకోవాలి? పిల్లల ఫీజులు కట్టుకోవాలి? ఇది పేదలను వేధించే ప్రభుత్వం. – **సంతోష్**, పండ్ల వ్యాపారి, నరసింహనగర్

చావే శరణ్యం



గత కొన్నేళ్లుగా రైతుబజార్ పరిసర ప్రాంతంలో బ్యాంగిల్స్, ఫ్యాన్సీ వ్యాపారం పాత తోపుడుబండిపై చేసుకుంటున్నాను. ఉన్నట్టుండి ఈ రోజు మా వ్యాపారాల్ని తొలగించారు. ఎలా బతకాలి. మాకు చావే శరణ్యం. ప్రభుత్వం న్యాయం చేయకపోతే ఏ విషమో తాగి చస్తాం. – **రమణమ్మ**, ఫ్యాన్సీ, బేంగిల్స్ వ్యాపారి, నరసింహనగర్

బడుగులపై 'మహా' ప్రతాపం

భీమిలి పరిధిలో వందకు పైగా దుకాణాల తొలగింపు


వుడా కాలనీ రోడ్డు దుకాణాన్ని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది

మధురవాడ/కొమ్మాది/తగరపువలస: భీమిలి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారుల దుకాణాలను, తోపుడు బళ్లను అధికారులు తొలగించడంతో వారంతా కన్నీటిపర్యంతమయ్యారు. జీవీఎంసీ జోన్.2 పరిధిలో తొలగింపు ఉద్రిక్తంగా మారింది. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో సుమారు 80 బడ్డీలు, దుకాణాలను అధికారులు తొలగించారు. కనీసం సమాచారమైనా ఇవ్వకుండా తొలగించారని ఆందోళన వ్యక్తం చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యాపారులు రోడ్డుపై బైఠాయించారు. పీఎం పాలెం పోలీసులు వచ్చి, ఆందోళనకారులతో మాట్లాడి, పరిస్థితిని చక్కబరిచారు. ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండ వెళ్లే డబుల్ రోడ్డు వెంబడి సుమారు 20 దుకాణాలను అధికారులు పొక్లెయిన్‌లతో తొలగించారు. రెండు రోజులైనా వ్యవధి ఇవ్వకుండా తోపుడు బళ్లు, టిఫిన్ సెంటర్లు, దుకాణాలను తొలగించడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-1 పరిధిలోని తగరపువలస మెయిన్‌రోడ్డు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను జెడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది తొలగించారు. చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు తొలగింపులు జరిగాయి.

చాలా అన్యాయం



ఏళ్ల తరబడి రోడ్డుపై చిరు వ్యాపారాల ద్వారా బతుకుతున్నాం. ఏళ్ల తరబడి జీవీఎంసీకి ఆశీలు కడుతున్నాం. ట్రేడ్ లైసెన్స్ ఉంది. కనీసం ముందుగా అయినా సమాచారం ఇవ్వకుండా, అధికారులు మాపై అకస్మాత్తుగా దాడి చేయడం అన్యాయం. ఇలా చేస్తే మా కుటుంబాలు ఏమై పోవాలి?

–**లక్ష్మి కుమారి**, చిరు వ్యాపారి

చిరువ్యాపారి ఆత్మహత్యాయత్నం

తాటిచెట్లపాలెం : నరసింహనగర్ రైతుబజార్ వద్ద 30 ఏళ్లుగా చిన్న బడ్డీలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు సాగిస్తున్న సుమారు 50 కుటుంబాలను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది. దీంతో ఆందోళన చెందిన నరసింహనగర్ ప్రాంతానికి చెందిన సంతోష్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాజు సీసాను పగులగొట్టి ఛాతీపై గట్టిగా కోసుకున్నాడు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు, బంధువులు అతడిని అడ్డుకొని వారించారు. ఇక్కడే పుట్టి పెరిగానని, ఈ ప్రాంతంలో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న చికెన్ సెంటర్‌ను తొలగించి, జీవనోపాధిపై వేటువేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. చిరు వ్యాపారులకందరికీ కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని వాపోయాడు.


గాజుసీసాతో ఛాతిపై గాయపరుచుకున్న చిరు వ్యాపారి సంతోష్

524 దుకాణాల తొలగింపు

దాబాగార్డెన్స్ : విశాఖలో 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు కార్యాచరణ చేపట్టినట్లు చెప్పారు.

వివిధ జోన్లలో తొలగించిన ఆక్రమణల వివరాలు

జోన్-1: తగరపువలస మెయిన్ రోడ్డు, భీమిలి రోడ్డులో మొత్తం 40 బడ్డీలు.
జోన్-2: జాతీయ రహదారి-16, శ్రీకాంత్‌నగర్ జంక్షన్ నుంచి పెదగదిలి జంక్షన్ వరకు మొత్తం 90
జోన్-3: ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు నుంచి గురుద్వారా జంక్షన్, డైమండ్‌పార్క్, శాంతిపురం జంక్షన్లలో మొత్తం 84
జోన్-4: సిరిపురం జంక్షన్ నుంచి జగదాంబ జంక్షన్ వరకు 60
జోన్-5: నరసింహనగర్, డీఎల్‌బీ గ్రౌండ్, సీఐఎస్ఎఫ్ గేట్, ఎన్జీవోస్ కాలనీ పరిధిలో మొత్తం 55
జోన్-6: పాత, కొత్త గాజువాక ప్రధాన రహదారులు, రాజీవ్‌నగర్ మార్గ్, కేకేఆర్ వాటర్ ప్లాంట్ రోడ్డులో మొత్తం 86
జోన్-7: నెహ్రూ చౌక్ నుంచి సుంకరమెట్ట రోడ్డు వరకు 42
జోన్-8: ఎస్ఎస్‌టీఎస్ జంక్షన్ నుంచి విమాన్ నగర్ జంక్షన్, గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు మొత్తం 67 టీ, టిఫిన్, బడ్డీలు, దుకాణాలను తొలగించామన్నారు.

'చలో పాడేరు మెడికల్ కాలేజ్'ను జయప్రదం చేయండి


'చలో మెడికల్ కాలేజీ' పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు

పోస్టర్‌ను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

సాక్షి, విశాఖపట్నం: పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను, భూములను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు చంద్రబాబు సర్కార్ కుయుక్తులు పన్నుతోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ పేరిట అతి పెద్ద స్కాంకు చంద్రబాబు పాల్పడుతున్నారని ఆక్షేపించారు.

దీన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కాలేజ్'పేరిట నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో 'చలో మెడికల్ కాలేజ్'పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఒక్క మెడికల్ కాలేజ్ కూడా తీసుకురాలేదని, వైఎస్ జగన్ తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలనుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన ప్రాంతంలో మెడికల్ కాలేజ్ తీసుకురావడం వైఎస్ జగన్ సంస్కరణలకు ఒక గొప్ప నిదర్శనమన్నారు. మెడికల్ కాలేజీలు అంటే ఒక మెడికల్ విద్య మాత్రమే కాదని అక్కడ వైద్యం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్ హయాంలో రెండేళ్ల పాటు కరోనాలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఈ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు పేడాడ రమణికుమారి, కర్రి రామిరెడ్డి, పులగా కొండారెడ్డి, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు జాడ శ్రావణ్‌కుమార్, యువజన, విద్యార్థి విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు కాగితాల రవికిరణ్, తాడి రవితేజ, ముమ్మల సంతోష్‌కుమార్, పాల రమణిరెడ్డి, లక్ష్మణ, కార్తీక్, నితాష్, రాష్ట్ర, జిల్లా అనుబంధ కమిటీ సభ్యులు శ్రీదేవివర్మ, నాగమణి, బొట్ట రాజు, పార్టీ ముఖ్య నాయకులు సునీల్, గీత రెడ్డి, బద్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రైవాడ మంచినీటి సరఫరా పథకంలో భాగంగా నరవ నుంచి టీఎస్ఆర్ వరకు నీరు సరఫరా చేసే ప్రధాన పంపు హౌస్ వద్ద ఏడీబీ పథకంలో భాగంగా మోటార్ సెక్షన్‌లను అనుసంధానం చేయడమే ఈ అంతరాయానికి కారణమని తెలిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రాంతాలు

జోన్-8: శ్రీరామనగర్, శ్రీనుబాబునగర్, అజంత పార్క్, టైలర్స్ కాలనీ, ఉడా కాలనీ, ఆర్.ఆర్.వి.పురం రజక కాలనీ
జోన్-5: మద్రిపాలెం, జ్యోతినగర్, మాధవధార, కళింగనగర్, ఎన్.జి.జి.ఓస్ కాలనీ, పట్టాభిరెడ్డి తోట, సూర్య నగర్, సిద్ధార్థ నగర్, తుమ్మడిపాలెం, సుభాస్ నగర్, మురళి నగర్, గాంధీ నగర్, రాజీవ్ నగర్, సింగరాయి మెట్ట, దయానంద నగర్, అంబేడ్కర్ ఎస్టేట్, తిక్కవానిపాలెం, జయప్రకాష్ నగర్, గోకుల్ నగర్, గొల్ల కంచరపాలెం, దుర్గ నగర్, పోస్ట్ ఆఫీస్ ఏరియా
జోన్-3: డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, చైతన్య నగర్, గాంధీ నగర్ ఏరియా, శారదా స్కూల్ లైన్, క్రాంతి నగర్, ఎన్.హెచ్.-16 రోడ్ ఏరియా, రామకృష్ణ నగర్, చిన్నూరు, మంగళ వీధి, లలితా నగర్, తదితర ప్రాంతాలు.

'డీఎస్సీ' ప్రయాణం గందరగోళం

- రాత్రే నగరానికి చేరుకున్న అభ్యర్థులు
- ఆఖరి క్షణంలో రద్దుతో నిరాశ

అరిలోవ : డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు అమరావతిలో శుక్రవారం జరగాల్సిన నియామక పత్రాలు అందించే కార్యక్రమం వాయిదా పడినట్లు డీఈవో ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. గుంటూరులో భారీ వర్షాల కారణంగా ఈ కార్యక్రమం రద్దయినట్లు డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు.

దీంతో అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎంపికైన 1,134 మంది అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో ఒకరిని అమరావతి తీసుకువెళ్లడానికి జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయం నుంచి అమరావతి వెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులను సైతం సిద్ధం చేశారు. అరకు, పాడేరు, ముంచంగిపుట్టుతో పాటు అనకాపల్లి జిల్లాలోని శివారు ప్రాంతాల అభ్యర్థులు బుధవారం రాత్రే నగరానికి చేరుకున్నారు. తెలిసినవాళ్ల ఇళ్లల్లో, లాడ్జీల్లో రాత్రి ఉన్నారు. తీరా తెల్లవారేసరికి కార్యక్రమం వాయిదా పడినట్లు కబురు తెలియడంతో నిరాశతో ఇసురోమంటూ ఇంటిముఖం పట్టారు. మరికొందరు గురువారం తెల్లవారుజామున వాహనాల్లో ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయానికి పయనమయ్యారు.

మార్గంమధ్యలో వాయిదా పడినట్లు మేసేజ్‌లు చూసి తిరిగి ఇంటికి తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఇంతకీ ప్రభుత్వం వర్షం కారణంగానే డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసిందా? లేదంటే హైకోర్టు ధర్మాసనం తీర్పు వల్ల వాయిదా వేసిందా? అనే అనుమానాలు అభ్యర్థుల్లో రేకెత్తుతున్నాయి.

సెల్లార్‌లో స్పెషల్ బార్!



సెల్లార్.. పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలి. లేదంటే.. ఆ భవనంపైనా, యజమానిపైనా చర్యలు తీసుకుంటామంటూ జీవీఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఈ హెచ్చరికలు మాత్రం సామాన్యులకు మాత్రమే. అధికారం చేతుల్లో ఉంటే.. సెల్లార్ కాస్తా.. స్పెషల్ బార్‌గా మారిపోయినా.. పట్టించుకోరు. దీనికి ఉదాహరణే ఈ ఫొటోలో కనిపిస్తున్న రెస్టారెంట్ అండ్ బార్. ఎంపీ అండదండలు.. అధికార పార్టీలో చోటా నేతగా హల్‌చల్ చేస్తే చాలు.. అనుమతులు లేకపోయినా.. బార్ పెట్టెయ్యొచ్చు. టీడీపీ ఎంపీ భరత్ అనుచరుడిగా చెప్పుకుంటున్న ఆళ్ల వాసు నేతృత్వంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బార్ ఇది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దాబాగార్డెన్స్‌లోని సెల్లార్‌లో అకస్మాత్తుగా ఈ బార్ వెలిసింది. నిబంధనలకు పూర్తి విరుద్ధంగా.. సెల్లార్‌లో నిర్వహిస్తుంటే.. జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అనుమతులు లేకుండా బార్ నిర్వహిస్తుంటే.. ఎక్సైజ్ అధికారులేమైనా చర్యలు తీసుకుంటున్నారా అంటే.. ఏమో సార్.. మాకు కనబడదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా ఒక వ్యక్తి మద్యం బాటిల్స్‌తో కనిపిస్తే వెంటనే పట్టుకొని నానా హడావుడి చేసే ఎక్సైజ్ అధికారులు.. స్వాతి రెస్టారెంట్ అండ్ బార్ విషయంలో మాత్రం .. సైలెంట్ మోడ్‌లో ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

– విశాఖసిటీ/ఫొటో సాక్షి ఫొటోగ్రాఫర్

రెచ్చిపోతున్న చైన్ స్నాచర్లు

సుమారు 17.5 తులాల బంగారం వస్తువుల అపహరణ



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ క్రైం ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

మర్రిపాలెం/గాజువాక: నగరంలో గొలుసు దొంగలు రెచ్చిపోయారు. కంచరపాలెం, గాజువాక పరిధిలో ఆరు వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రాత్రి మహిళల మెడలో నుంచి సుమారు 17.5 తులాల బంగారం వస్తువులను అపహరించారు. బాధితులు క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక బైక్‌పై జ్ఞానాపురం, కంచరపాలెం రైతుబజారు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, బిర్లా జంక్షన్ వంటి ప్రాంతాల్లో వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి బైక్ నడుపగా, వెనుక కూర్చున్న వ్యక్తి మాస్క్ ధరించి మహిళలను అడ్రస్ అడుగుతున్నట్టు నటిస్తూ వారి మెడలోని గొలుసులను లాక్కొని పారిపోయారు. జ్ఞానాపురంలో ఎం. అనంతలక్ష్మి మెడలో 3 తులాల గొలుసు, రామ్మూర్తి పంతులుపేటకు చెందిన విజయలక్ష్మి మెడలో 4.5 తులాల గొలుసు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద సంతోషి మెడలో 22 గ్రాముల గొలుసు, బిర్లా జంక్షన్ వద్ద స్రవంతి మెడలో 3 తులాల గొలుసు దొంగతనం చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులను వెంబడించగా, వారు బిర్లా జంక్షన్ దాటిన తర్వాత బైక్‌ను వదిలి పారిపోయారు. నిందితులు ఉపయోగించిన బైక్ గతంలో మహారాణిపేటలో చోరీకి గురైనట్లు పోలీసుల విచారణలో తేలింది. క్రైమ్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం క్రైమ్ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ ఘటన జరిగిన ప్రాంతాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. కంచరపాలెం క్రైమ్ సీఐ చంద్రమౌళి నేతృత్వంలో పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాజువాకలోని షీలానగర్‌లో బుధవారం రాత్రి రెండు వేర్వేరు చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగాయి. రెండు దొంగతనాల్లో మొత్తం 4.5 తులాల బంగారం అపహరణకు గురైంది. షీలానగర్‌కు చెందిన లక్ష్మీ ప్రియ.. డీమార్ట్ నుంచి ఇంటికి నడిచి వెళ్తుండగా, ఇద్దరు బైక్‌పై వచ్చిన యువకులు ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద లక్ష్మి తన అత్తతో కలిసి వెళ్తుండగా అదే తరహాలో బైక్‌పై వచ్చిన యువకులు ఆమె మెడలోని 2.5 తులాల పుస్తెల తాడును తెంపుకొని వెళ్లిపోయారు.గాజువాక క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికా బిల్లు.. ఐటీ కంపెనీలకు చిల్లు

- హైర్ బిల్లుపై ఐటీ సంస్థల బేజారు
- విదేశీ సేవలపై 25 శాతం పన్ను విధించేందుకు సిద్ధమవుతున్న అగ్రరాజ్యం
- విశాఖలో 75 శాతం ఐటీ కంపెనీలపై ప్రభావం
- లాభాలకు భారీగా గండిపడే అవకాశం
- బిల్లు పాసైతే మరింత ప్రమాదమంటున్న నిపుణులు



సాక్షి, విశాఖపట్నం: అమెరికా ప్రతిపాదించిన 'హాల్టింగ్ ఇంటర్నేషనల్ రీ లొకేషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్' చట్టం భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ చట్టం విదేశీ సేవలపై 25శాతం పన్ను విధించాలని ప్రతిపాదిస్తోంది. ఈ పన్ను విధానం అమలులోకి వస్తే, భారతదేశం, ముఖ్యంగా విశాఖపట్నంలోని ఐటీ, బీపీఓ కంపెనీలకు భారీ నష్టం వాటిల్లవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది.

'హైర్' చట్టం అంటే ఏమిటి?

అమెరికన్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడం, విదేశీ కార్మికులను నియమించుకోవడాన్ని తగ్గించడం లేదా నిషేధించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. అమెరికన్ కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించుకుంటే 25 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను ద్వారా వచ్చే ఆదాయాన్ని అమెరికా పౌరులకు ఉద్యోగాలు సృష్టించేందుకు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తారు. ఈ చట్టం డిసెంబర్ 31 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

భారత్‌పై ప్రభావం

భారతదేశంలో ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీల ఆదాయంలో ఎక్కువ భాగం అమెరికా నుంచే వస్తుంది. ఈ కొత్త పన్ను విధానం వల్ల వాటి లాభాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. విశాఖలో బీపీఓ సంస్థలన్నీ దాదాపుగా యూఎస్ ఆధారిత కంపెనీలే. ఇక్కడున్న 200 ఐటీ సంస్థల్లో 75శాతం యూఎస్ క్లయింట్‌లను కలిగి ఉన్నాయి. ఈ అదనపు పన్ను భారం వల్ల ఇక్కడి కంపెనీలు ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. లాభాలు తగ్గితే, కంపెనీలు ఉద్యోగుల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల వందలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం పాసయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే, అమెరికా కంపెనీలకు నైపుణ్యం కలిగిన ఉద్యోగులు దొరకకపోతే, వారి వ్యాపారాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని, ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని వారు విశ్లేషిస్తున్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే, భారత్‌తో పాటు అమెరికా కంపెనీల మార్జిన్లు కూడా క్షీణించే అవకాశం ఉందని హెచ్చరించారు.

అమెరికా సంస్థలు, ప్రజలపైనే భారం



భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు తీసుకొస్తున్న చట్టమే ఇది. తొలుత గూడ్స్‌పై రెండు సార్లు 25 శాతం చొప్పున సుంకాలు విధించారు. అప్పటికీ భారత్ దిగిరాలేదని భావించి.. నైపుణ్యాలపై దెబ్బతీసేందుకు హైర్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతోంది. దీనివల్ల భారత్ కంటే అమెరికాకే ఎక్కువ భారం. ఉదాహరణకు ఒక ఐటీ సంస్థ యూఎస్ సిటిజన్‌ని హైర్ చెయ్యాలంటే 10 వేల డాలర్లు చెల్లించాలి. అదే భారతీయులకు 2500 డాలర్లు వరకూ చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు భారతీయుల్ని తప్పించేందుకు యత్నిస్తే.. యూఎస్ కంపెనీలపైనా, అమెరికా ప్రజలపైనే ఈ భారమంతా పడుతుంది.

– ఒ. నరేష్, రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

భారత్ ఎదురుదాడి చేస్తే.. అమెరికా దిగొస్తుంది



ప్రస్తుతం ఉన్న దాదాపు 3,200 జీసీసీల్లో 1,600 భారత్‌లో ఉన్నాయి. ఇందులో సగానికి పైగా యూఎస్‌కి సంబంధించినవే. వీటికీ హైర్ చట్టం వర్తిస్తే.. వాటి మనుగడ ప్రశ్నార్థకమే. ఎస్‌టీపీఐ అధికారిక లెక్కల ప్రకారం ఇక్కడి నుంచి రూ.5 వేల కోట్ల ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో 70 శాతం వరకూ అమెరికా వాణిజ్యమే. వీటన్నింటిపైనా ప్రభావం ఉంటుంది. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో హైర్ చట్టం అమల్లోకి రాదనే భావిస్తున్నాం.ఒకవేళ ఈ ప్రతిపాదనని చట్టబద్ధం చేస్తే.. భారత్ కూడా ఎదురుదాడి చెయ్యాలి. అమెరికా ఆధారిత ఐపీ ఉత్పత్తులని నిషేధించడం, మైక్రోసాఫ్ట్ అడోబ్ వంటి ఉత్పత్తులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటిస్తే.. అమెరికా దిగొస్తుంది.

– శ్రీధర్ కొసరాజు, ఏపీ డీప్‌టెక్ నైపుణ్య సంస్థ ప్రతినిధి

ఓపీటీ విద్యార్థులపైనా ప్రభావం



అమెరికా ప్రతిపాదిస్తున్న ఈ హైర్ చట్టం కంపెనీలు ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) విద్యార్థులపై కూడా పన్ను విధిస్తుంది. ఓపీటీపై కూడా పన్ను విధించాలని ఇప్పటికే యూఎస్ చట్టసభ సభ్యులు ప్రతిపాదించారు. ఇప్పటివరకు యూఎస్‌లో ఓపీటీ కింద పనిచేస్తున్న విదేశీ విద్యార్థులకు ఎఫ్ఐసీఏ పన్నులు చెల్లించకుండా మినహాయింపు లభించేది. ఈ కొత్త చట్టం కనుక అమలులోకి వస్తే విదేశీ విద్యార్థులు కూడా ఈ పన్ను పరిధిలోకి వచ్చి వారు కూడా ఆ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా.. యూఎస్ వెళ్లి.. చదువుకుంటూ చిన్న చిన్న ఉద్యోగాలు చేయాలనుకున్న విద్యార్థులకు ఈ చట్టం గొడ్డలిపెట్టులా మారనుంది.

– బి. కోటేశ్వరరావు, ఐటీ ఉద్యోగి

మద్యం మత్తులో కారును ఢీకొట్టిన యువకుడు



సంఘటనా స్థలంలో గాయాలతో ప్రవీణ్

కొమ్మాది: బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్యం సేవించి బైక్ నడుపుతున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కారును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గీతం కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న పుక్కళ్ల ప్రవీణ్ తన స్నేహితులు అభిషేక్, లోకేష్‌లతో కలిసి బైక్‌పై మద్యం తాగి అతివేగంగా వచ్చాడు. సాయిప్రియ రిసార్ట్ వద్ద యూ–టర్న్ తీసుకుంటున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ఒకవైపు పూర్తిగా దెబ్బతినగా, ప్రవీణ్ బైక్‌పై నుంచి ఎగిరి దూరంగా పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని వెంటనే గీతం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్రవీణ్ స్నేహితులు అభిషేక్, లోకేష్ అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాన్వెంట్ కూడలిలో మెరైన్ పార్క్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో రూ.2.7 కోట్లతో నిర్మించిన మెరైన్ పార్కు విశాఖ పోర్ట్ ఆథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు ప్రారంభించారు. అలాగే ఇదే కూడలిలో 100 అడుగుల ఎత్తైన హైమాస్ట్ జాతీయ పతాకం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్ట్‌తో పాటు నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రోడ్లు, నడక మార్గాల మధ్య పచ్చదనం పెంచడం, రాత్రివేళల్లో పోర్ట్ అందంగా కనిపించేలా విద్యుత్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాన్వెంట్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా ఏర్పాటు చేయనున్న జాతీయ పతాకం పనులు మూడు నెలల్లో పూర్తవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్, వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ-గవర్నెన్స్ సదస్సుకు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట : విశాఖ వేదికగా ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న 28వ జాతీయ ఈ–గవర్నెన్స్ సదస్సు (ఎన్సీఈజీ)కు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించిన ఆయన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. వికసిత్ భారత్, సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ పేరిట రెండు రోజుల పాటు నోవాటెల్ హోటల్‌లో నిర్వహించే ఈ సదస్సులో ఆరు ప్లీనరీ, ఆరు బ్రేక్ అవుట్ సెషన్లు జరగనున్నాయని, దేశం నలుమూలల నుంచి వెయ్యి మంది వరకు అతిథులు, ఐటీ రంగ నిపుణులు, సీఎం చంద్రబాబుతోపాటు కేంద్ర, రాష్ట్రాల ఐటీ శాఖ మంత్రులు భాగస్వామ్యమవుతారని తెలిపారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో 13 ప్రధాన కమిటీలు, మరో 10 ఉప కమిటీలు వేసినట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రైవేటు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్గనైజింగ్ కమిటీకి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, భద్రతా కమిటీకి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నేతృత్వం వహిస్తున్నారని వివరించారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్ చర్యలు చేపట్టాలని, ఎయిర్ పోర్టు, రైల్వే స్టేషన్, ప్రభుత్వ స్థలాల్లో హోర్డింగ్లు, ఫ్లెక్సీలు పెట్టాలన్నారు. విమానాశ్రయం, రైల్వే స్టేషన్, హోటళ్ల వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీ అడ్మిన్ కృష్ణకాంత్ పాటిల్, డీఆర్వో భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత మాధుర్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు లేటెస్ట్ కాస్మోటాలజీ సేవలు

కేజీహెచ్‌లో డెర్మటాలజీకి నూతన పరికరాలు



నారో బ్యాండ్ ఫొటోథెరపీ మెషీన్

మహారాణిపేట: కేజీహెచ్ డెర్మటాలజీ విభాగం రోగులకు శుభవార్త అందించింది. అత్యాధునిక చర్మ, సౌందర్య సమస్యలకు ఉచిత చికిత్స అందించేందుకు రూ. 45 లక్షల విలువైన క్యూ-స్విచ్డ్ ఎన్డీ-వై ఏజీ లేజర్ యంత్రాన్ని కొనుగోలు చేసింది. ఈ లేజర్ యంత్రాన్ని ప్రభుత్వం ద్వారా సమకూర్చారని, దీంతో పాటు మరికొన్ని ఆధునిక యంత్రాలు కూడా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా లభించాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి , ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి తెలిపారు. ఈ కొత్త పరికరాలతో పేదలకు కూడా అధునాతన కాస్మోటిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వారు పేర్కొన్నారు.

అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలు

లేజర్ చికిత్సలు: కేజీహెచ్ డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి. శాంతి మాట్లాడుతూ.. ఈ కొత్త లేజర్ యంత్రం ముఖ్యంగా మంగు మచ్చలు, మొటిమల మచ్చలు, స్ట్రెచ్ మార్క్స్ తగ్గించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఈ సమస్యలకు చికిత్స అందించవచ్చని తెలిపారు. రోజేసియా, స్టెరాయిడ్స్ వాడకం వల్ల ఏర్పడిన మచ్చలను కూడా ఈ లేజర్‌తో సురక్షితంగా తొలగించవచ్చని వివరించారు.

జుట్టు , చర్మ సంరక్షణ: అనవసరమైన హెయిర్ తొలగింపు, బొల్లి , సోరియాసిస్ వంటి చర్మ వ్యాధులకు 'నారో బ్యాండ్ ఫోటోథెరపీ'తో కాంతి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

జుట్టు ఎదుగుదలకు చికిత్సలు: జుట్టు రాలడం సమస్య ఉన్నవారికి ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీలో లెవల్ లైట్ థెరపీ ద్వారా చికిత్సలు కూడా ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ శాంతి తెలిపారు.

ఈ ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ద్వారా కేజీహెచ్ చర్మ చికిత్సల విభాగం మరింత బలోపేతం అయిందని, దీనివల్ల పేద, మధ్యతరగతి రోగులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గురువారం రైల్వే పోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయి విలువ సుమారు రూ. 95 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సంయుక్తంగా రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన మాలతి సాహు, సుమితా సాహులు ముంబైకి అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి సుమారు 19 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

మూడేళ్లలో 79 కేసుల్లో రూ.63.50 లక్షలు చెల్లింపు



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: రోడ్డు ప్రమాద బాధితుల సహాయార్థం నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభించిన సహాయక కేంద్రం ద్వారా మూడేళ్లలో 79 కేసుల్లో బాధితులకు రూ.63.50 లక్షలు పరిహారంగా అందించినట్లు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేశామన్నారు. హిట్ అండ్ రన్ బాధితులకు, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పించే ఆర్థిక పరిహారం అందేంత వరకు సహాయ సహకారాలు అందించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలైన వారికి రూ.50 వేలు మంజూరు చేస్తామన్నారు. ఈ సహాయక కేంద్రం ద్వారా ఒక్కో బాధితునికి ఒక్కో పోలీస్ కానిస్టేబుల్‌ను ఎటాచ్ చేసి, రెవెన్యూ అధికారుల వద్ద తమ దరఖాస్తు ఇచ్చినప్పటి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరే వరకు వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. ఈ ప్రక్రియలో మూడేళ్లలో 79 మంది బాధితులకు న్యాయం జరిగిందని, మరో 106 దరఖాస్తులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం హిట్ అండ్ రన్ బాధితులు, బాధిత కుటుంబీకులతో ముఖాముఖి నిర్వహించారు. బాధితులెవరైనా తమ సహాయక కేంద్రాన్ని 7995095793 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదిస్తే, అవసరమైన సహాయం అందిస్తామన్నారు.

పీఎంఏవై-అర్బన్ 2.0 పథకంపై లబ్ధిదారులకు అవగాహన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. పథకం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పీఎంఏవై–అర్బన్ 2.0 ప్రచార అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అంగీకార్–2025 పేరుతో అక్టోబర్ 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పథకం కింద సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.00 లక్ష కలిపి మొత్తం రూ.2.50 లక్షలు ఉచితంగా అందిస్తుందని కమిషనర్ వివరించారు. ఈ పథకంతో పాటు, ఇల్లు నిర్మించుకున్న వారికి పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ఉచిత విద్యుత్ పథకం వంటి ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా అందుతాయని ఆయన తెలిపారు. ప్రజలకు ఈ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పి. సత్యవేణితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరుణకుమారికి కలెక్టర్ అభినందన



కరుణకుమారిని అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పాంగి కరుణకుమారి భారత్ వేదికగా నవంబర్‌లో జరగనున్న అంధ మహిళల టీ–20 ప్రపంచకప్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అభినందించారు. డీఈవో ప్రేమకుమారి, అంధ పాఠశాల నిర్వాహకులు గురువారం కరుణకుమారిని కలెక్టర్ చాంబర్‌కు తీసుకురాగా కలెక్టర్ విద్యార్థినికి శాలువా కప్పి, స్వీట్ తినిపించి సత్కరించారు. ప్రాక్టీస్ కోసం కరుణకు రెండు ప్రత్యేక క్రికెట్ కిట్‌లు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సాగరనగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కరుణకుమారి స్వగ్రామం వంట్లమామిడి.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: పరవాడ మండలం, ముత్యాలమ్మపాలెం శివారులోని జాలారీపేట గ్రామంలో బుధవారం జరిగిన హత్య కేసులో నిందితుడు ఒలిశెట్టి కొదండను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటల సమయంలో కొదండ.. గొడవపడి తన భార్య లక్ష్మి (45)ని కత్తితో పొడిచి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.గురువారం నిందితుడు కొదండ వెన్నలపాలెం సినిమా హాలు కూడలిలో సంచరిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అనంతరం అనకాపల్లిలోని 11వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించగా.. విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

11 బార్లకు లాటరీ ద్వారా లైసెన్సులు

మహారాణిపేట : జీవీఎంసీ పరిధిలో 2025–2028 సంవత్సరాలకు గాను కొత్త బార్ల లైసెన్సుల జారీ ప్రక్రియలో భాగంగా రెండవ దశ డ్రా గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 121 బార్లకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, గత నెలలో 58 బార్లకు లైసెన్సులు కేటాయించారు. మిగిలిన 63 బార్లకు రెండో దశలో నోటిఫికేషన్ జారీ చేయగా, 11 బార్లకు 44 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుదారుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ లాటరీని నిర్వహించి, అర్హులను ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులు ప్రభుత్వ నిర్ణయించిన రిటైల్ ఎక్సైజ్ టాక్స్ చెల్లించిన తర్వాత బార్లను ప్రారంభించుకోవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్ర మూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్. ప్రసాద్ తెలిపారు.

ఆర్పీ అలివేణిని పరామర్శించిన కేకే రాజు



అలివేణి యోగక్షేమాలు తెలుసుకుంటున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: తెలుగుదేశం పార్టీ నాయకుడి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్పీ ఎస్.అలివేణిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు గురువారం జగన్నాథపురంలోని ఆమె నివాసంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, అనుబంధ విభాగాల అధ్యక్షులు అంబటి శైలేష్, కర్రి రామారెడ్డి, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, భాను, నాగమని తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి మూడు అనాథ మృతదేహాల అప్పగింత



అనాథ మృతదేహాలు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తదితరులు

డాబాగార్డెన్స్: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు..అనారోగ్యంతో మృతి చెందిన ముగ్గురు అనాథ శవాలను వన్‌టౌన్ పోలీసులు గురువారం మెడికల్ కాలేజీలోని అనాటమీ విభాగానికి పరిశోధన కోసం అప్పగించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, పోలీస్ కమిషనర్ చొరవతో ఇప్పటివరకు 15 అనాథ శవాలను పరిశోధన నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో వన్‌టౌన్ సీఐ జీడీ బాబు, సిబ్బంది శ్రీను, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

21 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి



పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేసిన కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు తమ బాధ్యతలు మరింత మెరుగ్గా నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 21 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన వారు అంకితభావంతో పనిచేయాలని, జీవీఎంసీకి మరింత పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.


విశాఖలోనే ఈఎస్ఐ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నరసింగరావు

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐ మెడికల్ కాలేజీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడంపై సీపీఎం, సీఐటీయూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒత్తిడి కారణంగానే ఈ నిర్ణయం జరిగిందని సీపీఎం నాయకుడు, సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. సీపీఎం కార్యాలయంలో గురువారం సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. అత్యధికంగా ఈఎస్ఐ సభ్యులు 14 లక్షల మంది ఉన్న ఉత్తరాంధ్రలో కాకుండా అమరావతిలో మెడికల్ కాలేజీ పెట్టడం సరికాదన్నారు. షీలానగర్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం తుది దశలో ఉందని, దానికి అనుబంధంగా మెడికల్ కాలేజీని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే కాదని, వెనుకబడిన ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేస్తామని నరసింగరావు హెచ్చరించారు.

ఆటో బోల్తా: డ్రైవర్ మృతి



గౌరినాయుడు (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం, కుసులవాడ పంచాయతీ శివారులోని మలుపు రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ యర్ర గౌరినాయుడు (39) మరణించాడు. చందక పంచాయతీ, జగన్నాథపురం గ్రామానికి చెందిన గౌరినాయుడు ఇంటికి తిరిగి వెళ్తుండగా, తీగలవానిపాలెం చెరువు వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడి చెరువులోకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో ఆటోలో అతను ఒక్కడే ఉన్నాడు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటంతో ఆటో అతనిపై పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గౌరినాయుడు తన తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని మరణంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్యాన్సర్‌లో ట్రాన్స్‌లేషన్ మెడిసిన్‌పై ఏయూలో సదస్సు

మద్దిలపాలెం: ఏయూ బయోకెమిస్ట్రీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌లేషన్ మెడిసిన్ ఇన్ క్యాన్సర్‌పై జాతీయ సదస్సు వచ్చే నెల 27, 28 తేదీల్లో జరగనుందని బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.రాధిక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లినికల్ ప్రాక్టీస్‌కు లేబొరేటరీస్ రీస్కాన్స్‌ను వర్తింపజేయడం అనే అంశంలో పరిశోధనాత్మక సహకార మార్పిడిపై చర్చ ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు.